# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | సోమవారం 16 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 98

తెలుగు దినపత్రిక


# తాట తీస్తా...

## సీనియర్లకు స్ట్రాంగ్ వార్నింగ్..

## పిచ్చి వేషాలేస్తే ఊరుకునేది లేదు..

## మహేష్ వెనక నేనున్నా..

- టీపీసీసీ అంత అమాయకుడేం కాదు..
- తప్పుడు నిర్ణయాలతో ఆడుకోవచ్చనుకుంటే సంగతి తేల్చుడే..
- కులగణన తర్వాతే స్థానిక పోరు..
- రాజీనామా చేస్తానన్న సన్యాసి హరీశ్ రావు దాక్కున్నాడు
- కేసీఆర్, కేటీఆర్ పదవులుడిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు..
- గాంధీభవన్ లో కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

జనపదం, బ్యూరో:

టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ వెనక తాను ఉన్నానని, ఆయన వెనక జరిగే తెరచాటు రాజకీయాలను గమనిస్తూనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సౌమ్యుడయిన మహేశ్ కుమార్ గౌడ్ ను మభ్యపెట్టి తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా చేయాలనే ఆలోచన ఉన్న వారు ఎంతటి వారైనా ఊరుకునే ప్రసక్తే లేదని, అలాంటి వారి తాట తీయడం ఖాయమని పరోక్షంగా సీనియర్లకు సీఎం రేవంత్ హెచ్చరించారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ ......(తరువాయి 2లో)



# క్రేజీ.. కేజ్రీ..

- రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన ఢిల్లీ సీఎం..
- రెండు మూడు రోజుల్లో పదవిని వదులుకుంటానని ప్రతిజ్ఞ..
- నిజాయితీ నిరూపించుకున్న తర్వాతే మళ్లీ పదవని శపథం..
- కొత్త రాజకీయాలకు అరవింద్ ఆజ్యం..

4



# నటి కేసులో కీలక మలుపు..

- ముగ్గురు ఐపీఎస్‌లపై సస్పెన్షన్ వేటు
- అధికార దుర్వినియోగ ఆరోపణలుతో ఏపీ సర్కారు నిర్ణయం
- ఘటనపై ఇబ్రహీంపట్నంలో కేసు
- గతంలోనే సీఐ, ఏసీపీ కూడా విధుల నుంచి తొలగింపు..

3

**సంస్కారికి, హీనుడికి** మధ్య అంతరమిది., తల బిరుసుకు, తల్లో నాలుకకు మధ్య వైరమిది. మాట జారడం గొప్పనుకునే అల్పుడికి., నలుగురికి ఉపయోగపడేలా మాట్లాడడమే నిజమైన నాయకత్వం అనుకునే మేధావికి మధ్య జగడమిది. ఒక్క వేలు అటు చూపిస్తే, మిగతా నాలుగు ఇటే చూపిస్తాయనే ఇంగితం లేని తనంతో ప్రవర్తించే మిడిసిపాటుకు., వ్యవస్థపై గౌరవం, రాజకీయ అనుభవానికి మధ్య సాగుతున్న సమరమిది.

**మనిషితో పాటు హోదాకు,** కుర్చీకి కూడా విలువ ఇవ్వాలని తపించే ఔదార్యం ఓ వైపు.., కూర్చున్నాం కదా.. ఏం చేసినా చెల్లుతుంది., ఎలా మాట్లాడినా నడుస్తుంది అనే నడిమంత్రపు సిరి బాపతు మరో వైపు. ప్రజా సేవ చేయాల్సిన వారు పర్సనల్ టార్గెట్లతో దుమ్మెత్తిపోసుకోవడంతో ప్రయోజనమేంటో బాధ్యులకే తెలియాలి. హోదాలో ఉన్న వారు వైరి పక్షం మంచిచెడులను స్వీకరించి పనులతో సమాధానం చెప్పాల్సిన వేళ ఫ్రస్ట్రేషన్ లో పేలడం ఏమిటో 'ముఖ్య' నేతలకే అర్థం కావాలి. ఏదిఏమైనా సమాధానం చెప్పే ఓపిక లేనప్పుడే సంయమనం పోతుంది., పాలన చేతగాకపోతేనే పక్కోరి తప్పులు వెతికే పనిని కనిపిస్తుంది. వ్యక్తిగా నచ్చక పోయినా, ప్రజలవాడిగా మెప్పించేంత లేకపోవడమే సర్కార్ పెద్దల మాట తూలుడుకు కారణంగా తోస్తున్నది. నోరు జారి మూటగట్టుకోవడమా..? పనిలోకి దిగి కీర్తి కట్టుకోవడమా..? తేల్చాల్సింది ఎవరికి వారే., తన్మయించుకోవాల్సింది ఎవరి ఔన్నత్యాన్ని ముమ్మాటికి వారే.

# ఒరే సన్నాసి...

## అని మేం అనలేమా..?

- నీ విలువ ఎలాగూ పోయింది.. కూర్చీదైనా కాపాడు..
- దాక్కోలేదు.. నీ గుండెల్లో నిద్రపోతున్నా..
- రుణమాఫీ చేసే వరకు వెంటాడుతా..
- రేవంత్ నోటి బురద కడగడం కష్టం..
- కుర్స సీఎం.. బుద్ధిగా మార్చుకో..
- మిడిసిపాటు వదిలి., ప్రజా పాలన చెయ్..
- సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీష్ ఫైర్..

జనపదం, బ్యూరో

''అరే హౌలే., ఏరా గాండు., పోరా పుచ్చీ.., నువ్వో దరిద్రుడివి.., నీలాంటి వారు పెద్ద సన్నాలు.., అనే మాటలు అనలేక కాదు., నోటికి రాకా కాదు. పుట్టిన పుట్టుక., పెరిగిన సంస్కారం., నిర్వర్తిస్తున్న బాధ్యతలకు తలొగ్గి మాటలు వెనక్కి తీసుకుంటున్నామని'' మాజీ మంత్రి హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్ లో హరీష్ రావు ఆదివారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ......(తరువాయి 2లో)





# పీసీసీ పీఠంపై మహేశ్...

- అట్టహాసంగా బాధ్యతల స్వీకరణ
- సీఎం సహా ప్రముఖుల హాజరు..
- గాంధీ భవన్ తో అనుబంధాన్ని నెమరేసుకున్న మహేశ్..
- అందరితో కలుపుకుని పోతానని వ్యాఖ్య
- నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి పీసీసీ అధ్యక్ష బాధ్యతలను మహేశ్‌కుమార్ గౌడ్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్‌లో సందడి నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ పలువురు ఏఐసీసీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మహేశ్‌కుమార్ గౌడ్ గన్‌పార్కు నుంచి ర్యాలీగా గాంధీభవన్‌కు వచ్చారు. వాహనాలు, గుర్రాలు, బగ్గీ వాహనాలు, ఆదివాసీల నృత్యాలు, బోనాలు, శివ సత్తుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**పదవితో నిరూపితం**

పదవీ స్వీకరణ అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దమ్ము, ధైర్యంతో కూడిన పోరాటం వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లోనూ మరింత దమ్ము, ధైర్యం చూపించాల్సి ఉందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా తన నియామకం కార్యకర్తలకు గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేయటంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని నిరూపితమైందని వెల్లడించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని చెప్పారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఎక్కువ ని, నేతలు బహిరంగంగానే విమర్శలు చేసుకుంటారని చెప్పారు. కానీ సమయం వచ్చినప్పుడు పార్టీ కోసం, కార్యకర్తల కోసం ఏకమవుతారని, అందరం ......(తరువాయి 2లో)

# పటేల్ ను స్మరించిందా..?

- ఆయన కాంగ్రెసోడైతే.. విమోచనమెందుకు జరపడం లేదు..
- ప్రజా పాలన కాదు ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి..
- విమోచన దినోత్సవం జరిపితే భాగస్వాములవుతాం..
- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఎంపీ లక్ష్మణ్ తో కలిసి ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన మంత్రి..

4



# డిప్యూటీ సీఎం భట్టికి అరుదైన గౌరవం..

## నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం..



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు మెక్సికో దేశంలో మోంటిగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు. ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ 200వ వేడుకలో నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదుల సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఆహ్వానంలో తెలిపారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు. - జనపదం, హైదరాబాద్



# ఎవ్వళ్లకు వాళ్లే..

## అందరి టార్గెట్ సెప్టెంబర్ 17..

- పార్టీల్లో 'విమోచనం' ఫీవర్..
- ప్రజా పాలనా దినోత్సవానికి సర్కార్ సిద్ధం..
- వేడుకలకు కేంద్రమంత్రులకు ఆహ్వానం
- విమోచన దినోత్సవానికి బీజేపీ ఏర్పాట్లు
- సీఎం రేవంత్ కి పిలుపు
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభకు ఎంఐఎం సన్నాహాలు
- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభించిన కమ్యూనిస్టులు


3



# 'ఫార్మా సిటీ' ఉంటుందా.. లేదా..?

- కొనసాగిస్తుందో లేదో ప్రభుత్వం చెప్పాలి..
- గతంలో ఉన్న ప్లాన్ ప్రకారం చేయండి
- రద్దు చేస్తే భూములు తిరిగి రైతులకివ్వాలి..
- ఆ భూములను ఇతరాలకు వాడొద్దు
- రాజకీయాల కోసం యువతకు నష్టం చేయొద్దు
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ

4



# ట్యాంక్ బండ్ లోనే నిమజ్జనం..

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళన..
దిగివచ్చిన అధికారులు..

2



# అర్ధరాత్రి వరకు మెట్రో..

ఎంఎంటీఎస్ సర్వీసులు సైతం..
నిమజ్జన వేళ.. నగర వాసులకు గుడ్ న్యూస్

2

# వైద్యవిద్యలో స్థానికత తేల్చాల్సిందే...

- మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి బీఆర్ఎస్వీ యత్నం
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అరెస్ట్..




**జనపదం, హైదరాబాద్:** మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ఆదివారం యత్నించింది. పోలీసులు వారిని మినిస్టర్స్ క్వార్టర్స్ వెళ్లకుండా ముందే అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యలో స్థానికత నిర్ణయించడానికి జీవో నెంబర్ 33ని ఉపసంహరించి, కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన నుంచి మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి బయలుదేరారు. ఈ క్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తో పాటు బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో.. తెలంగాణ భవన్ వద్ద పోలీసులకు బీఆఎస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, డ్రీమ్డ్ యూనివర్సిటీ హోదాకు దరఖాస్తు చేసుకోవడం వాళ్ల 50 శాతం కన్వీనర్ కోట సీట్లు రాష్ట్ర విద్యార్థులు నష్టపోతున్నారని గెల్లు శ్రీనివాస్ వివరించారు. ఫలితంగా.. పేద,మధ్యతరగతి కుటుంబాలను వైద్య విద్యకు దూరం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఆ కుట్రలో భాగంగానే.. జీవో 33ని కొనసాగించాలని సుప్రీం కోర్టును రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆశ్రయించిందని ఆరోపించారు. తెలంగాణ గడ్డ మీద పుట్టి.. ఇతర రాష్ట్రాల్లో చదివినవారికి స్థానికత వర్తించకుండా జీవో నెం 33 ద్వారా కన్వీనర్ కోట కింద సీటు కోల్పోయే పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు లబ్దిచేకూర్చే కుట్ర జరుగుతోందన్నారు. అందుకే ఈ ప్రభుత్వం జీవో 33ని వెనక్కి తీసుకోవటమే కాకుండా.. సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేయాలని మాజీ సీఎం కేసీఆర్.. 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్న తెలంగాణలో.. జిల్లాకో మెడికల్ కాలేజీ నిర్మించి నిరుపేద విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులను అందిస్తే.. ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం వైద్య విద్యను విద్యార్థులకు దూరం చేస్తోందంటూ మండిపడ్డారు. వైద్య విద్యను అభ్యసించాలని కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థుల జీవితాలతో ఏమిటీ చెలగాటమని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంటే.. తెలంగాణలో మాత్రం ఇంకెంత కాలం ఈ సందిగ్ధమని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డలను నాన్ లోకల్స్‌గా మార్చి.. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పెద్దపీట వేసే జీఓ 33ను అమలు చేసేంతగా.. కాంగ్రెస్ సర్కారుకు ఎందుకింత మొండిపట్టని గెల్లు శ్రీనివాస్ ప్రశ్నించారు. స్థానికతను నిర్ధారించే విషయాన్ని ప్రభుత్వం ఎందుకింత వివాదాస్పదం చేస్తోందన్నారు. తెలంగాణ విద్యార్థులకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాజీనామా చేయాలని గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# ఒరే సన్నాసి...



**(మొదటిపేజీ తరువాయి)** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు రకాల వరదలతో ప్రజలు తిప్పలు పడుతున్నారని, ఒకటి వర్షాలతో వచ్చినదైతే, మరోటి చిల్లర సీఎం రేవంత్ అబద్ధాల వరద అన్నారు. వరదలతో వచ్చిన బురదను కడుక్కోగలుగుతున్నాం గానీ, ముఖ్యమంత్రి నోటి నుంచి వస్తున్న మురుగు బురదను మాత్రం కడగలేకపోతున్నామని దుయ్యబట్టారు. ఆ మాటల దుర్వాసన మోరీల కంపును మించి పోయింది ఎద్దేవా చేశారు. కనీసం ప్రభుత్వంలో ఉన్నాననే సోయి లేకుండా, ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నాననే ఇంగితం కూడా లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఈ మధ్యే నాకు కాకున్నా నా కుర్చీకన్నా మర్యాద ఇవ్వమని అన్నాడని, అయినా మళ్లీ మళ్లీ అదే తీరుగా ప్రవర్తిస్తూ మర్యాద పోగొట్టుకుంటున్నాడని, కుర్చీ మర్యాదను కూడా మంటగలుపుతున్నాడన్నారు.

## సంస్కారం అడ్డొస్తుంది..

ముఖ్యమంత్రికి ఆయన భాషలోనే జవాబు ఇవ్వడం నిమిషంలో పనని, కానీ ఆ భాష మాట్లాడటానికి సంస్కారం అడ్డొస్తుందన్నారు. పదే పదే పొడుగు గురించి దుర్భాషలాడుతున్నాడని, అవును... తాను నిజంగానే పొడుగని, తెలంగాణ ఉద్యమం తనను ఎంతో ఎత్తుకు చేర్చిందని గర్వంగా ప్రకటించారు. కానీ, సీఎం రేవంత్ బుద్ధి కురుచదని, చరిత్ర, భాష.. ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ పొట్టివే అని, ఆయన నేలకు ఇంతుండి ఆత్మన్యూనతతోనే తన పొడుగుపై మాట్లాడుతున్నాడన్నారు. ప్రజల దీవెనలతో తాను తాటిచెట్టంతా ఎదిగానని, రేవంత్ వెంపలి చెట్టంత భూమికి జానెడున్నాడని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తాను సీఎం ను లిల్లీపుటని, సన్నాసి అని అనలేక కాదని అలా మాట్లాడే కుసంస్కారం తనకు లేదన్నారు.

## ప్రజల గురించి ఆలోచించు..

తన ఎత్తు ఎంత ఉంటే సీఎం కు ఎందుకని, ఇప్పటికి ఈ విషయమై 20 సార్లు మాట్లాడాడని, తన హైట్ గురించి మానేసి ప్రజలు, రైతుల గురించి ఆలోచించాలని హరీష్ రావు సూచించారు. రుణమాఫీ చెయ్యలేదని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా సిగ్గులేకుండా మాట్లాడుతున్న సీఎం ఈయనే అన్నారు. రేవంత్ దుర్మార్గ నిబంధనలతో సురేందర్ రెడ్డి అనే రైతు ప్రాణం పోయింది నిజం కాదా అన్నారు.

## వెళ్దాం.. వస్తావా..

రుణమాఫీ పూర్తి చేశా.. అని సీఎం మాట్లాడుతున్నాడని, దేవుళ్ల మీద కూడా ఒట్లేసి అబద్ధాలు చెప్పిన సీఎం ఆయననే చూస్తున్నామన్నారు. దమ్ముంటే రుణమాఫీ అయిందని నిరూపించాలని, తాను ఎక్కడి రమ్మానా వస్తానని రేవంత్ కు సవాల్ విసిరారు. ఆయనకు సంబంధించిన కొండారెడ్డిపల్లి చౌరస్తాకి రావాలా.., లేదంటే సిద్దిపేట వెంకటాపురం వెళ్దామా..? రేవంత్ చెప్పాలన్నారు. వెంకటాపురంలో 122 మందికి అయితే 82 మందికి కాలేదని, కోటి 13 లక్షల 74 వేలు అయితే కోటి 5 లక్షల మాఫీ జరగలేదన్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం కాదని, సురేందర్ రెడ్డి అనే రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసిన వారి వివరాలు తనకు పంపడం కాదని, అవసరమైతే పూర్తి డాటా నేను వారికి పంపుతానని పేర్కొన్నారు.

## సన్నాసి అనడం నాకూ వచ్చు..

రుణమాఫీ 31 వేల కోట్లు జరిగితే 17 వేల కోట్లు చేశావ్.. అంటే సగం కూడా కాలేదని హరీష్ నిలదీశారు. రుణమాఫీ చేస్తానని చెప్పి చేయలేనీ సన్నాసి అని తాను అనలేనా అని ప్రశ్నించారు. అలాగే పంట బోనస్ బోగస్ చేసిన సన్నాసని, ఆరు గ్యారంటీలు నెరవేర్చని సన్నాసి అని.., పింఛన్ 4000 అని మాట తప్పిన సన్నాసి అని.., మహిళలకు 2500 రూపాయలని మాట తప్పిన సన్నాసి అని.., ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని మాట తప్పిన సన్నాసి అని.. నేను అనాలేనా అని హరీష్ దుయ్యబట్టారు. ఒకటి కాదు రెండు కాదు 100 సార్లు సన్నాసి అనగలనని, కానీ తనకు విలువలున్నాయని, సీఎం లాగా నోరు పారేసుకోలేనన్నారు. ఒక వేలు నాకు చూపిస్తే నాలుగు వేళ్లు తననే చూపుతాయని విషయం సీఎం గుర్తుపెట్టుకోవాలన్నారు. రైతుల కళ్లలో ఆనందం కాదు, కన్నీళ్లు తెప్పించాడన్నారు.

## ఎవరి మాట నమ్మాలి..

రెండు లక్షల పైన రుణం ఉంటే మాఫీ చేస్తమని సీఎం అంటున్నాడని, అదే సమయంలో వ్యవసాయ మంత్రి ఏమో డబ్బులు కట్టండని సెలవిస్తున్నారని ఎవరి మాటలు నమ్మాలని హరీష్ నిలదీశారు. రాష్ట్ర మంత్రులకు సుతి లేదు, క్యాబినెట్ సుతిలేదు .. ఇదేం కేబినెట్టో సీఎం కే తెలియాలన్నారు. తాను రెండు లక్షల పైన మిత్తి ఉంటే కట్టిన వాళ్ల జాబితా పంపుతున్నానని, దమ్ముంటే వాళ్లకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆ మాటకొస్తే తుమ్మల చెప్పింది కరెక్టా..? లేదంటే సీఎం చెప్పింది కరెక్టా..? తేల్చాలన్నారు. మాట మీద లేని సన్నాసి ఎవరో చెప్పాలన్నారు.

## నీ గుండెల్లో నిద్రపోతున్నా..

తాను మాట తప్పి ఎక్కడెక్కడో దాక్కున్నానని రేవంత్ పేలుతున్నాడని, తానెక్కడికి పోలేదని, సీఎం గుండెల్లో నిద్ర పోతున్నానన్నారు. రేవంత్ కు నిద్ర పట్టనీయకుండా సగం రుణమాఫీ చేయించానని, మిగతా సగం చేయించే దాకా వదిలిపెట్టి ప్రసక్తే లేదన్నారు. రోజూ ఆయన వెంటే పడుతానన్నారు.

## ఫోర్త్ సిటీ ఎక్కడిది..?

కేసీఆర్, కేటీఆర్ కృషి చేసి రూ.1500 కోట్లు ఖర్చుపెట్టి 12 వేల ఎకరాలు సేకరించారని, అక్కడ సీఎం రియల్ ఎస్టేట్ చేసే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. వంట అంతా అయ్యాక వడ్డించేందుకు వచ్చాడని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భూములు వాపస్ అన్నాడని, అయితే పార్మా సిటీ పెట్టు లేదంటే భూములు ఇవ్వాలని, మధ్యలో ఈ డ్రామాలేంటన్నారు. ఉచిత కరెంటు ఉత్త కరెంటు చేశాడని, నిజమైన ఉచిత కరెంటు ఇచ్చింది కేసీఆర్ అని, మోటార్లు కాలకుండా చూసింది బీఆర్ఎస్ సర్కార్ అన్నారు.

## ఎవరి గాంధీ..

రేవంత్ రెడ్డేమో గాంధీని పంపాను., మనోడే అన్నాడని, శ్రీధర్ బాబేమో బీఆర్ ఎస్ వాళ్లు కొట్టుకున్నారని, కాంగ్రెస్ అని ప్రచారం చేస్తున్నారన్నారు వాళ్లు మా పార్టీ ఎమ్మెల్యేలే కాదన్నారు. ఇంతకీ గాంధీ ఎవరి వాడో చెప్పాలన్నారు. సీఎం మాటలు చూస్తుంటే దాడి చేయించింది తానే అని తెలిసిపోతుందన్నారు. పైకి హైద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, రీజినల్ రింగ్ రోడ్డు కోసం తెగ కష్ట పడ్డాం, మంజూరు చేయించాం అంటున్నారని, కిషన్ రెడ్డి 2022 డిసెంబర్ 6 భారత్ మాల ప్రాజెక్టు లో రీజినల్ రింగు రోడ్డు కలిసి ఉంటుందని చెప్పిన విషయాన్ని హరీష్ రావు గుర్తు చేశారు. ఉత్తరం వైపు తాము చేయించామని, దమ్ముంటే దక్షిణం వైపు పనులు చేయించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో చేసినవి కూడా తామే చేశామని చెప్పడం సిగ్గు లేని చర్య అన్నారు. సీఎం చెప్పే అబద్ధాలు వింటే అబద్ధాలు కూడా హుస్సేన్ సాగర్ లో దూకుతాయన్నారు. రుణమాఫీ, టీచర్ల బదిలీ, బోనస్, రీజినల్ రింగ్ రోడ్డు, ఫోర్త్ సిటీ ఇలా రోజుకో పది అబద్ధాలు ఆయనకు అలవాటయ్యాయన్నారు.

## ఇప్పటికైనా చెయ్..

రుణమాఫీ రూ.31 వేల కోట్లు చెల్లించే వరకు బీఆర్ఎస్ సీఎం వెంటే పడుతుందన్నారు. ఇప్పటికైనా బాధ్యతగా మాట్లాడడం, అగౌరపర్చకుండా నడుచుకోవడం చేయాలన్నారు. తమకు మాట్లాడడం చేతగాక కాదని, దంచుడ్రి., కొట్టుర్రి, చింత కాయ కొట్టుర్రి అంటే కింది స్థాయిలో తాము మాట్లాడితే గొడవలు జరగవా అని ప్రశ్నించారు. నిజానికి రాష్ట్ర బ్రాండ్ దెబ్బ తింటున్నది సీఎం వల్లే అని, 9 నెలల్లో 9 మత కలహాలకు జరిగాయని, సగం రుణమాఫే జరిగిందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

### పగటి కలలు ఆపు..

సీఎం రేవంత్ రెండు సార్లు గెలుస్తామని పగటి కలలు కంటున్నాడని, కాంగ్రెస్ కు అంత సీన్ లేదన్నారు. రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లో కాంగ్రెస్ గెలిపిస్తే 5 ఏళ్ల లోగా ప్రభుత్వాలు పోయాయన్నారు. రేవంత్ అదృష్టం బాగుంటే ఐదేళ్లు ఉంటాడని, లేదంటే అంతే అన్నారు. ఇప్పటికైనా మంచిగా ప్రవర్తించాలని, ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ఒక్కటితోనే సరిపెట్టుకోవాల్సిందే అన్నారు. 2018లోనే కేసీఆర్ టీచర్ల ట్రాన్స్ ఫర్ చేశాడని, కానీ సీఎం 18 ఏళ్ల తర్వాత చేశామనడం విడ్డూరంగా ఉందన్నారు.

### ఇజ్జత్ తీసుకోకు..

ముఖ్యమంత్రి పదవి ఇజ్జత్ తీస్తున్నాడని, అడ్డగోలుగా అబద్ధాలు చెప్పి పరువు తీసుకోవద్దని హరీష్ సూచించారు. పాఠశాలల్లో ఉచిత కరెంటు అని ఉత్తా మాటలు చెబుతున్నాడని, కేసీఆర్ స్కూల్స్ కి గ్రాంట్స్ ఇస్తే అది బంద్ చేసి స్కూల్ కరెంట్ బిల్లులు కడుతున్నాడని ఎద్దేవా చేశారు.

## తాట తీస్తా...

**(మొదటిపేజీ తరువాయి)** సభలో పాల్గొన్న సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం పునరుద్ఘాటించారు. వచ్చే మూడు నెలల్లో కులగణన పూర్తి చేస్తామని చెప్పారు.

### కార్యకర్తల గెలుపు కోసం..

అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామని సీఎం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. వారి గెలుపు విషయంలో అభ్యర్థుల కంటే ఎక్కువగా కష్టపడతామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న, వారి జోలికి ఎవరొచ్చినా ఊరుకునే ప్రసక్తే లేదని, ఒకవేళ వస్తే వీపు చింతపండు అవుతుందని హెచ్చరించారు. ఎవరైనా మంచితనాన్ని చేతకానితనంగా తీసుకుంటే ఉరికిచ్చి కొడతామంటూ బీఆర్ఎస్ కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

### సన్నాసి హరీష్ దాక్కున్నాడు

ఆగస్టు 15లోగా పంట రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేసిన సన్నాసి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మాట నిలుపుకోకుండా ఎక్కడో దాక్కున్నాడని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల ప్రచారం, పాదయాత్రలో చెప్పామనని, అసెంబ్లీ ఎన్నికల్లో వాళ్ల ఉద్యోగాలు ఊడగొట్టిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది చివరి వరకు మరో 35వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. దానికి సంబంధించిన కసరత్తు జరుగుతుందన్నారు.

### నిరుద్యోగులకు స్కిల్ యూనివర్సిటీ..

నిరుద్యోగులకు నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం దీక్ష పూనిందనీ ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 2028 జరిగే ఒలింపిక్స్ లో దేశం తరపున బంగారు పథకాలు సాధించే బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం వ్యాఖ్యానించారు.హైదరాబాద్ ను విశ్వనగరంగా మార్చే దిశగా ప్రయత్నాలు జరుగుతన్నాయన్న సీఎం.. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో ఫోర్త్ సిటీ..ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామన్నారు.అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సెమీ ఫైనల్స్ మాత్రమేనన్న సీఎం.. 2029లో ఫైనల్స్ జరగబోతున్నాయని వ్యాఖ్యానించారు. ఎర్రకోటపై మువ్వన్నెల జెండా ఎగరేసి రాహుల్ ను ప్రధాని చేసినప్పుడే ఫైనల్స్ గెలిచినట్లుగా భావించాలని, అప్పటి వరకు శ్రమించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు సూచించారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 స్థానాల్లో గెలిచి తీరాల్సిందేనని చెప్పారు.

### మహేశ్ వెనక నేనున్నా..

తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలంటే పూర్తి సమయాన్ని కేటాయించే పార్టీ అధ్యక్షుడు ఉండాలని అధిష్టానాన్ని కోరామని సీఎం తెలిపారు. ఆ మేరకు అధ్యక్ష పదవిపై సుదీర్ఘ చర్చలు, సమాలోచనలు, మంతనాలు జరిపిన ఏఐసీసీ మహేశ్ కుమార్ గౌడ్ ను ఎంపిక చేసిందన్నారు. ఈ క్రమంలో ఈ పదవికి పూర్తి అర్హత ఉందని నమ్మిన హైకమాండ్ మహేష్ కుమార్ గౌడ్ కు అధిష్టానం గురుతర బాధ్యత అప్పగించిందన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్లాలని సీఎం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ఒవైసీలకు భయపడుతున్నారా..?

- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** ఒవైసీలకు భయపడే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17 ను విమోచనా దినోత్సవంగా నిర్వహించడం లేదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచనా దినోత్సవంగా నిర్వహించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కి బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీలకు భయపడే విమోచనా దినోత్సవం నిర్వహించడం లేదా అని లేఖలో ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఒవైసీ బ్రదర్స్‌కు భయపడే నిర్వహించలేదని, అందుకే బీఆర్ఎస్ హయాంలో సమైక్యత దినోత్సవంగా నిర్వహించారని మహేశ్వర్ రెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. విమోచనా దినోత్సవానికి బదులుగా ప్రజాపాలన దినోత్సవం అంటోందన్నారు. ఏ విధంగా చూసినా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కో పేరుతో తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. మరో రెండు రోజులు ఉందని, ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు. గతంలో హైదరాబాద్ రాజ్యంలో రాజకార్ల అరాచక పాలనను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేసిన అమరుల త్యాగా లను గుర్తించాలన్నారు. అందుకు సెప్టెంబర్ 17వ తేదీన ప్రజా పాలన దినోత్సవం అని కాకుండా, తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని సూచించారు. ఇలా చేయకపోతే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు. బీజేపీ తరుపున ఈసారి కూడా విమోచనా దినోత్సవ వేదు కల్ని రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్ స్టేట్ నుంచి విడిపోయి మ హారాష్ట్ర, కర్ణాటకలో కలిసిన జిల్లాలోనూ... సెప్టెంబర్ 17న విమోచనా దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కానీ ఎంఐఎం, ఒవైసీ బ్రదర్స్ కు భయపడి తెలంగాణలో ప్రభుత్వాలు విమోచనా దినోత్సవంగా జరపడం లేదని ఆరోపించారు.

## ట్యాంక్ బండ్‌లోనే నిమజ్జనం..

- భాగ్యనర్ గణశ్ ఉత్సవ సమితి ఆందోళన..
- దిగివచ్చిన అధికారులు..



**జనపదం, హైదరాబాద్:** ట్యాంక్‌బండ్‌పై వినాయకుల నిమజ్జనాన్ని నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయంపై అధికారులు యూటర్న్ తీసుకున్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనతో అధికారులు దిగి వచ్చారు. హుస్సేన్‌సాగర్‌లో వినాయకుల నిమజ్జనానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన భారీ గేట్లు, నిమజ్జనం చేయకూడదని సూచిస్తూ పెట్టిన ఫ్లెక్సీలను తొలగించారు. హుస్సేన్‌సాగర్‌లో గణపతులను నిమజ్జనం చేయడానికి క్రేన్‌లను రంగంలోకి దింపుతున్నారు.

### భాగ్యనగర ఉత్సవ సమితి సభ్యులు ఆందోళన

హుస్సేన్‌సాగర్‌లో వినాయకుల నిమజ్జనాన్ని నిషేధిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రకృతికి హాని కలిగించే విగ్రహాలను సాగర్‌లో నిమజ్జనం చేయకూడదని కోర్టు సైతం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో భాగ్యనగర ఉత్సవ సమితి సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనానికి ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిమజ్జనం సాఫీగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని మాటిచ్చిన ప్రభుత్వం, ట్యాంక్‌బండ్ చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేసి నిషేధించడం సరికాదని మండిపడ్డారు. ఈ క్రమంలో ట్యాంక్‌బండ్‌పై పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి, భక్తులతో ఉత్సవ సమితి సభ్యులు గణేశ్ నిమజ్జనం చేయించారు. ఈ రోజు సాయంత్రం వరకు నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయకపోతే సోమవారం నగర వ్యాప్తంగా నిరసన చేపడుతామని వారు హెచ్చరించారు.

## అర్ధరాత్రి వరకు మెట్రో..

- ఎంఎంటీఎస్ సర్వీసులు సైతం..
- నిమజ్జన వేళ..నగర వాసులకు గుడ్ న్యూస్

**జనపదం, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో గణేశ్ నిమజ్జనాల దృష్ట్యా ప్రజలకు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 17న అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తాయని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అన్ని స్టేషన్ల నుంచి అర్ధరాత్రి 1 గంటకు బయల్దేరి 2 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని వెల్లడించారు. ఈ మేరకు హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ్ టీ సీనియర్ అధికారులతో సమావేశమైన ఆయన నిమజ్జనం దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెలలో ఖైరతాబాద్ గణేశ్ సందర్శనతో మెట్రో రైలు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా నమోదైందని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఒక్క రోజే ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ నుంచి 94 వేల మంది ప్రయాణించారని తెలిపారు. 39వేల మంది ఎంట్రీ, 55 వేల మంది ఎగ్జిట్‌లు ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌లో నమోదైనట్లు వివరించారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్ మెట్రో స్టేషన్లలో అదనపు పోలీసులు, ప్రైవేటు భద్రతా సిబ్బందితో పర్యవేక్షిస్తున్నామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

### ఎంఎంటీఎస్ పొడిగింపు

నగరంలో గణేశ్ నిమజ్జనాల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. ఈ మేరకు ఎంఎంటీఎస్ అదనపు ట్రిప్పులను తిప్పనున్నట్లుగా వెల్లడించింది. నిమజ్జనం రోజు నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు ఎంఎంటీఎస్ సర్వీసులకు నడిపిస్తామని అధికారులు తెలిపారు. ఈ నెల 17,18 తేదీల్లో ఎంఎంటీఎస్ సేవలను భక్తులు వినియోగించుకోవాలని కోరారు. 17వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 18వ తేదీ తెల్లవారుజామున 4 గంటల వరకు సర్వీసులు నడుపుతున్నట్లుగా వివరించారు.

## పీసీసీ పీఠంపై మహేశ్...

**(మొదటిపేజీ తరువాయి)** ఏకతాటిమీదకు రావడం చూసినందునే కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని పేర్కొన్నారు.

### 40 ఏళ్ల అనుబంధం

గాంధీభవన్‌తో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని, కాంగ్రెస్‌లో 1985లో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా తన ప్రస్థానం ప్రారంభమైందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కౌశిక్‌రెడ్డి వాడిన భాష వల్లే అరెకపూడి గాంధీ అనుచరులు నొచ్చుకున్నారని, బూతులు తిట్టుకోవడం తెలంగాణ రాజకీయాల్లో గతంలో లేదని ఆయన పేర్కొన్నారు. 2014లో కేసీఆర్ సీఎం అయ్యాకే, తెలంగాణ రాజకీయాల్లో భాష మారిపోయిందని, కేసీఆర్‌కు దీటుగా సమాధానం చెప్పేందుకే రేవంత్‌రెడ్డి కూడా కాస్త గట్టిగా మాట్లాడారని గుర్తుచేశారు. పార్టీని నమ్ముకుంటే ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని తనకు పీసీసీ పదవితో నిరూపితమైందని వెల్లడించారు.

### నేడు రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ..

**జనపదం, బ్యూరో:** రాష్ట్ర సచివాలయం ముందు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆవిష్కరించనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

### సీఎం ఇంటి వద్ద బ్యాగ్ కలకలం..

**జనపదం, క్రైంబ్యూరో:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి సమీపంలో ఆదివారం గుర్తు తెలియని బ్యాగు కలకలం రేపింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటికి సమీపంలో అనుమానాస్పదంగా ఓ బ్యాగ్ కనిపించగా.. అప్రమత్తమైన చీఫ్ సెక్యూరిటీ వింగ్ అధికారులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుంచి మరో ప్రాంతానికి తీసుకెళ్లి తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి నివాసం వద్ద బందోబస్తు కట్టుదిట్టం చేశారు. పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని.. సీఎం ఇంటివైపు వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సీసీ కెమెరాలపై కూడా అధికారులు ఫోకస్ పెట్టారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారి నుంచి అధికారులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

# మెట్రో రెండో దశకు డీపీఆర్లు రెడీ

- ఐదు మార్గాల్లో 78.6 కి.మీ. ప్రతిపాదన
- ఈనెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పణ
- కేబినెట్ ఆమోదం తర్వాత కేంద్ర ఆమోదానికి
- మొదటి దశలోని మూడు కారిడార్లకు కొనసాగింపుగా
- రెండో ఫేజ్‌లో రూ.24,042 కోట్లతో 60కి పైగా స్టేషన్లు



**జనపదం, సిటీ బ్యూరో:** హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ రైలు మార్గం పనులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)లు సిద్ధమయ్యాయి. ఐదు మార్గాల్లో కలిపి 78.6 కి.మీ.ల మేర పనులకు సంబంధించిన ప్రతిపాదనలు గతంలోనే జరగగా తాజాగా 60కి పైగా స్టేషన్ల కోసం రూ.24,042 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే ఈ మార్గాలపై సీఎం.. అధికారులకు పలుమార్లు కీలక సూచనలు చేశారు. సీఎం ఆదేశాలు, సూచనలతో రెండో దశ డీపీఆర్‌లు రెండు వేర్వేరుగా రూపుదిద్దుకున్నాయి. అయితే ఈ రెండు డీపీఆర్‌లో సీఎం సూచించిన కొత్త మార్గాలన్నింటిని అధికారులు పరిగణలోకి తీసుకుని అంచనాలు రూపొందించారు. రెండో దశలో ప్రతిపాదించిన మార్గాలన్నీ మొదటి దశలోని మూడు కారిడార్లకు కొనసాగింపుగా ఉన్నాయి. తాజాగా సిద్ధమైన రెండు డీపీఆర్‌లను ఈనెలాఖరు వరకు రాష్ట్ర ప్రభుత్వానికి అందే అవకాశాలున్నాయి. తర్వాత మంత్రిమండలిలో ఆమోదం తెలిపి, వాటిని కేంద్రం అనుమతి కోసం పంపించనున్నారు. కాగా మహానగరానికి ఓఆర్ఆర్ తర్వాత మణిహారం లాంటి మెట్రో రైలు పనుల్లో వేగం పుంజుకోవడంతో నగర ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

### కొత్త మార్గాలన్నీ కొనసాగింపే..

ఈ రెండు డీపీఆర్‌లో సీఎం సూచించిన కొత్త మార్గాలన్నీ కొనసాగించారు. రెండో దశలో ప్రతిపాదించిన మార్గాలన్నీ మొదటి దశలోని మూడు కారిడార్లకు కొనసాగింపుగా ఉన్నాయి. కేంద్రానికి రెండోదశ డీపీఆర్‌లు త్వరగా చేరాలంటే ఫ్యూచర్ సిటీని మినహాయించాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి 32 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఒకవేళ ఐదు కారిడార్లతో పాటు ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో డీపీఆర్‌ను కూడా కలిపి పంపాలని కేంద్రం కోరితే మెట్రో విస్తరణకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈరెండు కలిపితే 110 కిలోమీటర్లు అవుతుంది.

★కారిడార్-3కి కొనసాగింపుగా నాగోల్ నుంచి ఎల్బీనగర్, మైలార్‌దేవుపల్లి, జల్‌పల్లి, శంషాబాద్ విమానాశ్రయం వరకు 33.1 కిలోమీటర్లను పొడిగిస్తారు. ఈ మార్గంలో 22 స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ కారిడార్‌నే మైలార్‌దేవుపల్లి నుంచి ఆరాంఘర్, రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీ సమీపంలో నిర్మించే కొత్త హైకోర్టు వరకు పొడిగిస్తారు. మూడు స్టేషన్లలతో దాదాపు 5 కిలోమీటర్లు దూరం ఉండనుంది.

★అలాగే ఈ కారిడార్-3కి మరోవైపు రాయదుర్గం నుంచి కాజాగూడ, నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, యూఎస్ కాన్సులేట్ మీదుగా కోకాపేట నియో పోలీసు వరకు 11.3 కిలోమీటర్ల వరకు విస్తరించడానికి డీపీఆర్‌ను సిద్ధం చేశారు.

★కారిడార్-1కి కొనసాగింపుగా ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 8 కిలోమీటర్ల మార్గాన్ని పొడిగిస్తారు.

★మరోవైపు కారిడార్-1కి రెండోవైపు పొడిగింపుగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 14 కిలోమీటర్లు పొడిగించి, చందానగర్ ప్రాంతంలో కొంతదూరం డబుల్ డెక్‌ని ప్రతిపాదించగా, ఈ మార్గంలో 10 స్టేషన్లు రానున్నాయి.

★కారిడార్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. పొడిగిస్తారు. ఆరు స్టేషన్లు రానున్నాయి.

# ఏఐటీయూసీ ఓ బ్రోకర్ సంఘం..

- 9 నెలల తర్వాత గుర్తింపు చెల్లదు..
- పైరవీలో రూ.కోట్ల వసూలు
- లాభాల వాటా చెల్లింపులో డ్రామా
- యాజమాన్యం పైరవీకారులకు తావివ్వొద్దు..
- 35 శాతం వాటాను సీఎంతో మాట్లాడి ఇప్పిస్తాం..
- హెచ్ఎంఎస్ నేత రియాజ్ అహ్మద్

**జనపదం, పెద్దపల్లి :** గుర్తింపు సంఘంగా ఉన్నా ఏఐటీయూసీ ఓ బ్రోకర్ సంఘంగా మారిందని హెచ్ఎంఎస్ నేత రియాజ్ అహ్మద్ ఆరోపించారు. తొమ్మిది నెలల తర్వాత గుర్తింపు సంఘంగా యాజమాన్యం పత్రం ఇవ్వడాన్ని ఇన్వాల్యుడేషన్ పత్రంగా ఆయన అభివర్ణించారు. గుర్తింపు హోదా పత్రం తీసుకోవడానికి 9 నెలలు ఎందుకు ఆగాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు హోదా పత్రం చెల్లదని, గుర్తింపు రద్దుచేసి ఎన్నికలు నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులు శ్రమించి బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా సాధించి సంస్థకు, ప్రభుత్వానికి 2023 సంవత్సరానికి గాను అధిక లాభాలను ఆర్జించి పెట్టారన్నారు. సింగరేణి సీఎండీతో ఇటీవల జరిగిన ఐదు జాతీయ కార్మిక సంఘాల సమావేశంలో లాభాల వాటా చెల్లించేందుకు సీఎండీ అంగీకరించారని రియాజ్ అహ్మద్ తెలిపారు. 35 శాతం లాభాల వాటాను ఈ నెల చివరన లేదా అక్టోబర్ లో ప్రకటించేందుకు త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి ఒప్పిస్తామని, సింగరేణి సీఎండీ కూడా అందుకు అంగీకారం తెలిపారన్నారు. అయితే 35 శాతం వాటా ఇప్పించేందుకు అన్ని కార్మిక సంఘాలు ముందుకు రావాలని ఆయన కోరారు. గుర్తింపు సంఘం గా ఉన్నా ఏఐటీయూసీ ఓ బ్రోకర్ సంఘంగా మారిందని, గుర్తింపు హోదా పత్రం తీసుకోవడానికి 9 నెలలు ఎందుకు ఆగాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు హోదా పత్రం చెల్లదని, గుర్తింపు రద్దుచేసి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం గోదావరిఖనిలో జరిగిన బహిరంగ సభలో ఆయన పక్కనే కూర్చున్న ఏఐటీయూసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతారామయ్య, మరో ఐ ఎన్ టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తమ రాజకీయ లబ్ధి కోసమే వేదికపై ఆసీనులయ్యారని, అయితే సింగరేణి కార్మికుల సమస్యలను ప్రస్తావించకపోవడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. సింగరేణి సంస్థలో డిపెండెంట్ ల ఎంప్లాయిమెంట్లో కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ, డి పెండెంట్ ఉద్యోగులతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. సింగరేణి గనుల్లో అండర్ గ్రౌండ్ లో పనిచేయాల్సిన కొంతమంది లీడర్ల కొడుకులు వారి బంధువులను సర్ఫేస్ మ జ్దురుగా నియమిస్తూ యాజమాన్యం తొత్తులుగా మారారని విమర్శించారు. జనరల్ మజ్దూర్ కేటగిరీకి విద్యార్హతల పేరును జోడించి 30 ఏళ్లుగా పని చేస్తూ గని ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ కార్మికులను సర్ఫేస్ మజ్దూర్ లుగా పెట్టాల్సి ఉండగా వారిని విస్మరిస్తూ, పైరవీ కోసం కొత్తగా ఉ ద్యోగంలో జాయిన్ అయినా యువకులకు సర్ఫేస్ జనరల్ మ జ్దూర్లుగా నియమిస్తూ వారి పైరవీలు కొనసాగిస్తూ యాజమా న్య తొత్తుగా మారారని అన్నారు. గత రెండు నెలల నుండి సింగరేణి కార్మికులకు క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహించడం లేదని, తమకు అనుకూలంగా ఉన్న క్వార్టర్లను కేటాయించుకొని ఓ గుర్తింపు సంఘం నాయకుడు పైరవీకారుగా అవతారం ఎత్తారని విమర్శించారు. కొన్ని భూగర్భ గనుల్లో వెల్ఫేర్ ఆఫీసర్లు అవినీతి పరులుగా మారి గుర్తింపు సంఘం ఏఐటియూసీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

**లాభాల వాటా కోసం...**

సింగరేణి స్టాండరైజేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాల్లో కార్మికుల లాభాల వాటా 35 శాతం చెల్లించేందుకు, దీపావళి లాభాల బోనస్ రూ.లక్ష ఇచ్చేందుకు తాము చర్చించనున్నామని రియాజ్ అహ్మద్ తెలిపారు. కోల్ ఇండియా లో దసరాకు లాభాల బోనస్ ఇస్తారని, సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ గా చెల్లిస్తారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం పైరవీకారులకు తావివ్వొద్దని, లోపబూయిష్టంగా ఉన్న సింగరేణి ఆర్ జీ వన్ యాజమాన్య పరిపాలనను సరిదిద్దాలని కోరారు. ఇటీవల ఇద్దరు జీఎంలు అవినీతి పరులుగా మారి గుర్తింపు సంఘం భజనపరులుగా మారినందున వారికి బదిలీలు రిటైర్మెంట్లు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న జీఎం గుర్తింపు సంఘం లోని కొంతమంది లీడర్లు పైరవీకారులుగా మారారని, వారికి అవకాశం ఇవ్వొద్దని, సీనియారిటీ ప్రకారంగా సింగరేణి కార్మికులకు జనరల్ మజ్దూర్ సర్ఫేస్ గా నియమించాలని కోరారు. సమావేశంలో హెచ్ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఆర్ జీ వన్ బ్రాంచి సెక్రటరీ సహదేవ్, హెచ్ఎంఎస్ అధికార ప్రతినిధి క్యాంపెనింగ్ ఇంచార్జి క్రాంతి కుమార్, ఫిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీలు రామచంద్రారెడ్డి, దబ్బెట మల్లేష్, టి.సంపత్, నజీర్, బొడిగె సతీష్, రహీం, రాజ్ కుమార్, శ్రీనివాస్, ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రకృతి వైపరీత్యం..

## విపత్తుతో రాష్ట్రానికి రూ.10,300 కోట్ల నష్టం

- కేంద్రం సాయం కోరినం.. జరిగిన నష్టం నివేదించాం..
- నష్ట నివారణ చర్యలు చేపట్టాం
- ఇంత త్వరగా ఏ ప్రభుత్వాలు గతంలో ఆదుకోలేదు
- భారీ వర్షాలతో తెగిపోయిన కాల్వలకు, చెరువులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు
- నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జనపదం, సూర్యాపేట :** ఆగస్టు నుంచి సెప్టెంబరు మొదటి వారంలో భారీ నుంచి భారీ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.10,300 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో తెగిపోయిన నాగార్జునసాగర్ ఎడమ కాల్వలకు, చెరువు కట్టలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రైతంగానికి సాగు నీరు ఇవ్వటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఇందుకు గాను నాగార్జున సాగర్ ఎడమ కాలువ పునర్నిర్మాణానికి రూ.2.10 కోట్లతో పనులు ప్రారంభించామని, వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం నడిగూడెం మండలం కాగిత రామచంద్ర పురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు పడిన గండి వద్ద పున్నరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి మంత్రి పరిశీలించారు.

**గత ప్రభుత్వాలు ఇంత త్వరగా ఆదుకోలేదు.**


భారీ వర్షాలతో రాష్ట్రంలో 10,300 కోట్ల నష్టం జరిగిందిని, అయితే ఇంత త్వరగా ఏ ప్రభుత్వాలు గతంలో ఆదుకోలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పూర్తి నివేదికను కేంద్ర బృందం ద్వారా పంపామని, కేంద్రం నుంచి మంచి సహాయం రాష్ట్రానికి అందుతుందని విశ్వసిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు నష్టం బాగా జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరదలు వచ్చిన మొదటి గంట నుంచి సహాయక చర్యలకు ఆదేశించారని, ప్రతి మంత్రి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేశారని మంత్రి తెలిపారు. ఈ గండిని పూడ్చడానికి ప్రభుత్వం వెంటనే రూ.2.10 కోట్లు మంజూరు చేసిందనని, రాత్రింబవళ్లు పని చేసి వారం రోజుల్లో గండిని పూడ్చాలని అధికారులకు మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు, అధికార యంత్రాంగం మొత్తం క్షేత్ర స్థాయి లో పర్యటించి వరద నష్టం నివారణ చర్యలు చేపట్టామని, ఇంతటి ప్రకృతి వైపరిత్యంలోను ప్రభుత్వం ఎక్కడా వెనకకు తగ్గకుండా సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు.

**వారం రోజుల్లో సాగు నీరివ్వాలి...**

చిలుకూరు మండలం అర్లేగూడెం వద్ద గండి పడిన రెడ్లకుంట మేజర్ కాలువ పునరుద్దరణ పనులు రైతులతో కలిసి ట్రాక్టర్ పై వెళ్లి పరిశీలించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కాలువ గండి మరమ్మత్తు పనులకు రూ.96.60 లక్షలు మంజూరు చేశామని, వారం రోజుల్లో గండిని పూడ్చి రైతులకి సాగు నీరు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కాలువ ద్వారా కింది ప్రాంతాల్లో 20,000 ఎకరాలు సాగుచేస్తున్నారని, గండి పూడ్చటం ఆలస్యం అయితే నీరు లేక పొలాలు ఎండిపోతాయన్నారు. కాబట్టి త్వరగతిన గండి పూడ్చి ఆయకట్టు రైతంగాన్ని ఆదుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే కాలువకు గండి పడటంతో నష్టపోయిన రైతులకు త్వరలోనే నష్ట పరిహారం అందేలా చూస్తామని అన్నారు . అనంతరం హుజూర్ నగర్ మండలం కరక్కాయలగూడెం వద్ద గండి పడిన ముక్త్యాల బ్రాంచ్ కాల్వను జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ గండి పూడ్చేందుకు ప్రభుత్వం 34 లక్షలు మంజూరు చేసిందని, వేగంగా పనులు పూర్తి చేసి మూడు రోజుల్లో కాల్వ ద్వారా సాగు నీరు పారెలాగా అధికారులు కృషి చేయాలని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ ఈ రమేష్ బాబు, తహసీల్దార్లు సరిత, ధ్రువ కుమార్, నాగేందర్, ఇరిగేషన్ డీఈ రఘు, అధికారులు,ప్రజా ప్రతినిధులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విమోచనం ఫీవర్..!

- ప్రజా పాలనా దినోత్సవానికి కాంగ్రెస్ సర్కార్ సిద్ధం
- వేడుకలకు రావాలని కేంద్ర మంత్రులకు ఆహ్వానం
- పరేడ్ గ్రౌండ్‌లో విమోచన దినోత్సవానికి బీజేపీ ముమ్మర ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డికి అందిన పిలుపు
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభకు ఎంఐఎం సన్నాహాలు
- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభించిన కమ్యునిస్టులు




**జనపదం, బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర సర్కార్ ముందు పెద్ద సమస్య వచ్చి పడింది. అధికార పార్టీకి విమోచనం గుబులు పట్టుకున్నది. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి సెప్టెంబర్ 17 వ తేదీపై రాష్ట్రంలో రాజకీయ మంటలు రాజుకున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో బీజేపీకి మధ్య డైలాగ్ రాజకీయాలను హీటెక్కిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం పేరుతో ఉత్సవాలు జరగగా, ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో ప్రజా పాలనా దినోత్సవం పేరుతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విమోచన దినోత్సవం అనంటోన్న బీజేపీ.. కర్ణాటకలోని జిల్లాల్లో విమోచనం పేరుతో వేడుకలు చేసుకుంటుంటే తెలంగాణ లో మాత్రం ఏడాదికో పేరుతో జరుపుకోవడం ఏంటని ప్రశ్నిస్తోంది. మరో వైపు.. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇటు ఇప్పటికే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలకు శ్రీకారం చుట్టిన సీపీఐ సైతం ఈ నెల 17న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో భారీ సభకు ప్లాన్ చేసింది. ఇటు అధికార కాంగ్రెస్ సైతం ఆ రోజు ప్రజాపాలన దినోత్సవం పేరిట జాతీయ జెండాలను ఎగురవేయాలని నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జెండావిష్కరణ చేయనున్న పార్టీ మంత్రులు, సీనియర్లతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఇదిలా వుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న ప్రజా పాలనా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాలంటూ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు లేఖలు రాశారు. 1948, సెప్టెంబరు 17న తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆ లేఖల్లో వెల్లడించారు. ఈ క్రమంలో 17న హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు. ఇటు ఎంఐఎం సైతం ఆ రోజు నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహణకు సిద్ధమవుతున్నది.

**విమోచన దినోత్సవ వేడుకలు**

బీజేపీ పార్టీ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా తెలంగాణ విమోచన దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర పార్టీ సహకారంతో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ నెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో నాటి తెలంగాణ చరిత్రను సమాజానికి కళ్ళకు కట్టేలా ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవ సంబురాలకు అందరూ రావాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బంగారు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలు ఉట్టిపడేలా కార్యక్రమాలు ఉంటాయని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఉత్సవాలకు రావాలని బీజేపీ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలికారు.



# ముంబై నటి కేసులో కీలక మలుపు..

- ముగ్గురు ఐపీఎస్‌లపై సస్పెన్షన్ వేటు
- అధికార దుర్వినియోగ ఆరోపణలుతో ఏపీ సర్కారు నిర్ణయం
- ఘటనపై ఇబ్రహీంపట్నంలో కేసు



**జనపదం, బ్యూరో :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో కీలక పరిణామం సంభవించింది. ఈ వ్యవహారంలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా తాతా, ఐపీఎస్ అధికారి విశాల్‌గున్నిను సస్పెన్షన్ చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు చేసింది. ముంబై నటి కేసులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, ఆమెను వేధించిన పోలీసులపై చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ఘటనపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే విధంగా విజయవాడలో పని చేసిన అప్పటి ఏసీపీ హనుమంతరావు, నాటి ఇబ్రహీంపట్నం సీఐ ఎం.సత్యనారాయణలను సస్పెండ్ చేశారు. తాజాగా ఈ కేసులో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన ఐపీఎస్‌లు పి. సీతారామాంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీలపై చర్యలు తీసుకున్నారు. 2024 ఫిబ్రవరి రెండో తేదీన ఉదయం 6:30 గంటలకి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విశాల్ గున్ని బృందం డీజీపీకి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ముంబైకి వెళ్లినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఏడున్నర గంటలకి ముంబై వెళ్లే విమానం ఎక్కినట్టు విచారణలో వెల్లడైంది. సినీనటి జత్వానీ అరెస్టుకు సంబంధించిన అంశాన్ని డీజీపీకి సమాచారం ఇవ్వకుండా ఉండటంపైనా అభియోగాలు నమోదు అయ్యాయి. అదే సమయంలో ఎఫ్ఐఆర్ నమోదైన కొన్ని గంటల్లోనే ఎలాంటి లిఖితపూర్వక ఆధారాలు లేకుండానే అరెస్టు వ్యవహారంలో నిర్ణయం తీసుకోవడంపైనా అభియోగాలు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి విజయవాడ సీపీ కాంతిరాణా తాతా, విజయవాడ డీసీపీ విశాల్ గున్నిలు ఒకే రకంగా వ్యవహరించినట్టు అధికారులు గుర్తించారు.

**వారిపై కేసులు నమోదు చేయాలనే ఫిర్యాదుతోనే..!**

ఫోర్జరీ పత్రంతో తనపై తప్పుడు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేసిన వ్యవహారంలో అప్పటి నిఘా విభాగాధిపతి సీతారామాంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్‌గున్ని, వైఎస్సార్సీపీ నేత కుక్కల విద్యాసాగర్‌లపై కేసు నమోదు చేయాలని ముంబై నటి ఫిర్యాదు చేశారు. శుక్ర, శనివారం వరుసగా రెండు రోజుల పాటు తన న్యాయవాదులు పీవీజీ ఉమేష్ చంద్ర, పాల్‌తో కలసి ఆమె విజయవాడ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం స్టేషన్‌కు వెళ్లారు. సీఐ చంద్రశేఖర్‌కు పలు వివరాలు ఇచ్చి, ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముంబయి నటి ఫిర్యాదు మేరకు కుక్కల విద్యాసాగర్, మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే నటి కాదంబరీ జెత్వానికి వైసీపీ పెద్దల వేధింపుల వ్యవహారంలో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతి రాణా టాటా, విశాల్ గన్నీలపై సస్పెన్షన్ వేటు వేసింది. అధికార దుర్వినియోగ ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఏసీపీ హనుమంతరావులను డీజీపీ సస్పెండ్ చేశారు. డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ముగ్గురు ఐపీఎస్ అధికారులపై కూడా వేటు పడింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. జీవో నంబర్ 1590, 1591,1592 విడుదల చేసింది. కాన్ఫిడెన్షియల్ అని వెబ్‌సైట్‌లో ప్రభుత్వం పేర్కొంది.




# తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ ..

- ఆటలు సాగనివ్వమంటూ సీపీఐ హెచ్చరిక

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని, నిజాం రాచరిక పాలనకు, కరుడుగట్టిన భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా సాగిన మహత్తర పోరాట చరిత్రను వక్రీకరిస్తూ వాస్తవాలను చీకటి పొరల్లోకి నెట్టాలనుకుంటున్న ఆ పార్టీ ఆటలు సాగనీయమని సీపీఐ నాయకులు హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ గత వారం రోజులుగా సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, చందు నాయక్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యుడు నేర్లకంటి శ్రీకాంత్, చంద్రమోహన్ గౌడ్, ఉమర్ ఖాన్ తో కలిసి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ మాట్లాడారు. ఆ రోజుల్లోని నిజాం పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడేవారి గొంతుకలను అణచివేసేవారని అన్నారు. ప్రజలు తమ చేతికి దొరికిన కర్రలు, కట్టెలు, బరిసెలతో పోరాటం సాగించడం కష్టమని భావించిన సమయంలో కమ్యూనిస్టు సాయుధ పోరాటానికి పిలుపునివ్వడం జరిగిందని, ఈ క్రమంలో వేలాదిమంది ప్రజలు భూస్వాములపై తిరుగుబాటు చేసి, వాళ్ల చేతుల్లో ఉన్న లక్షల ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నారని గుర్తు చేశారు. నిజాం సర్కార్ ప్రజా పోరాటాల ముందు తలవంచని పరిస్థితి ఏర్పడిందని, అప్పటికే అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం పటేల్ సైన్యం ఎలాగైనా తెలంగాణ ప్రాంతాన్ని కమ్యూనిస్టుల చేతుల్లోకి పోనివద్దని, కుప్పకూలే దశలో ఉన్న నిజాంతోని ఒప్పందాన్ని కుదుర్చుకొని అతడికి రాజ్ ప్రముఖ్ (గవర్నర్) పదవి ఇవ్వడమే కాకుండా ఆస్తులను, నష్టపరిహారాన్ని రాజభరణాలు, చెల్లించేలా ఆమోద పత్రాలు చేసుకున్నారన్నారని వివరించారు. 1956 వరకు గవర్నర్ గా ఉన్న నిజాం బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు వల్ల హైదరాబాద్ సంస్థానానికి విమోచన జరిగిందని ఎలా చెబుతారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్ర పోరాటానికి, హైదరాబాద్ సంస్థానంలో జరిగిన భూస్వామ్య నిరంకుశ పాలనకు ఏనాడు మద్దతు తెలపకుండా పాలకవర్గాలకు వత్తాసు పలికిన ఆర్ఎస్ఎస్ శక్తులు చరిత్రను కప్పిపుచ్చి ప్రజలు చేసిన త్యాగాలను చెప్పకుండా చేసే ప్రయత్నాలను ఎండగడతామని తెలిపారు. ఇలాంటి తప్పుడు విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కోరారు. హైదరాబాద్ సంస్థానంలో సాగిన మహత్తరమైన ప్రజా పోరాట చరిత్రను సామాజిక మాధ్యమాల ద్వారా యువతలోకి తీసుకెళ్తామని చెప్పారు.

# ముస్లింలను విడగొట్టేందుకే రషీద్ విడుదల


- నాడు పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించిన వారితోనే నేడు దోస్తా..
- మోడీ సర్కారుపై ఫరూక్ అబ్దుల్లా ఫైర్




**జనపదం, బ్యూరో :** జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా ఎంపీ ఇంజనీర్ రషీద్ జైలు నుంచి విడుదల కావడంతో మోడీ ప్రభుత్వంపై నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్, జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ముస్లింలను విడుగొట్టేందుకే అసెంబ్లీ ఎన్నికల ముందు ఇంజనీర్ రషీద్‌ను జైలు నుంచి విడుదల చేశారని ఆరోపించారు. ఒకప్పుడు పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించిన వారే.. ప్రస్తుతం ఆ పార్టీతో జత కట్టారని మండిపడ్డారు. 1987లో జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్కడ చోటుచేసుకున్న పరిణామాలను ఫరూక్ అబ్దుల్లా గుర్తుచేశారు. నాడు పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించిన వారితోనే నేడు కలిశారని బీజేపీపై ఆయన నిప్పులు చెరిగారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీతో జతకట్టిన నేషనల్ కాన్ఫరెన్స్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే.. కాశ్మీర్ లోయలో ఉగ్రవాదం మళ్లీ పేట్రేగిపోతుందని శనివారం ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. 2019లో ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, అయినా రాష్ట్రంలో ఉగ్రవాద కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయని ఫరూక్ అబ్దుల్లా గుర్తుచేశారు. ఉగ్రవాదుల చేతికి ఆయుధాలు ఎలా వస్తున్నాయని ఆయన సందేహం వెలిబుచ్చారు. ఎన్నికల ముందు ఇంజనీర్ రషీద్ జైలు నుంచి విడుదల వుతున్నారంటే ఆయన కచ్చితంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు చెందిన వ్యక్తేనని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి.. మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాపై ఇంజనీర్ రషీద్ భారీ అధిక్యంతో గెలిచారు. ఉగ్రవాదులకు నిధులు, ఆయుధాలు సమకూరుస్తున్నారనే ఆరోపణలపై కొన్ని రోజుల క్రితం ఇంజనీర్ రషీద్‌ను అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి తీహార్ జైల్లో ఉన్న ఆయనకు బెయిల్ లభించడంతో తాజాగా జైలు నుంచి విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో ఫరూక్ అబ్దుల్లా పైవిధంగా స్పందించారు. కాగా, జమ్ము కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 18, 25, అక్టోబర్ 5వ తేదీల్లో మూడు విడతల్లో జరగనుంది. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడనున్నాయి.

# మరోసారి తెరపైకి జమిలి ఎన్నికలు?!

- అన్నిపార్టీలు మద్దతిస్తాయని ఎన్డీఏ ఆశాభావం...
- అమలు దిశగా 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' బీజేపీ హామీ



**జనపదం, ఢిల్లీ :** 'ఒక దేశం.. ఒకే ఎన్నిక' అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ప్రస్తుత ఎన్డీయే పాలనలోనే జమిలి ఎన్నికల నిర్వహణ మొదలవుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తుందని ఎన్డీఏ భాగస్వాములు విశ్వాసం వ్యక్తం చేశాయి. మూడోసారి అధికారంలోకి వచ్చి100 రోజులు పూర్తి చేసుకున్న మోడీ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తికాలం పాలన కొనసాగిస్తుందని తెలిపాయి. గత నెలలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై ప్రధాని మోదీ ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా ఏవో ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతుందోని ఆందోళన వ్యక్తం చేశారు. దీని నుంచి బయపడాలంటే జమిలి ఎన్నికలే సరైన మార్గమని నొక్కి చెప్పారు. దీనికోసం అన్ని రాష్ట్రాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాజాగా మోదీ 3.0 ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో జమిలి ఎన్నికల దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల భాజపా మేనిఫెస్టోలో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' కూడా ఉంది. దీనిపై అధ్యయనం చేసేందుకు ఎన్నికలకు ముందే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృ త్వంలో కేంద్రం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా అభిప్రాయాన్ని వెల్లడించింది. జమిలి ఎన్నికలకు రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్ నిర్వహించాలని పేర్కొంది. ఆ తర్వాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలని నివేదికలో తెలిపింది. ఇందుకోసం రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని కమిటీ సూచించింది. మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని తెలిపింది.




## జర్నీ మొదలైంది..

శర్వానంద్, నిత్యమీనన్ కాంబోలో వచ్చిన చిత్రం మళ్లీ మళ్లీ ఇది రాని రోజు. క్రాంతిమాధవ్ దర్వకత్వంలో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీ మంచి టాక్ తెచ్చుకుంది. ఆ తర్వాత డైరెక్ట్ చేసిన వరల్డ్ ఫేమస్ లవర్ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. తాజాగా క్రాంతి మాధవ్ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. ఈ చిత్రం DGL టైటిల్‌తో రాబోతుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రాబోతున్న ఈ చిత్రం తెలంగాణ బ్యాక్ డ్రాప్‌లో ఉండబోతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. కొంతమంది స్నేహితులు కాజీపేట్ జంక్షన్ సమీపంలోని రైల్వే బ్రిడ్జిపై కూర్చొని సరదాగా ఎంజాయ్ చేస్తుండగా.. కింద నుంచి రైలు వెళ్తుంది. ప్రయాణం మొదలైంది.. అంటూ లాంచ్ చేసిన ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఆర్తి క్రియేటివ్ టీమ్ బ్యానర్‌పై గంటా కార్తీక్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ నవంబర్‌లో మొదలు కానుంది.

## పెండ్లి చేసుకున్న మేఘా ఆకాశ్

టాలీవుడ్ భామ మేఘా ఆకాశ్ ఆగస్టులో తన ప్రియుడు సాయి విష్ణుతో నిశ్చితార్థం పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. వెడ్డింగ్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల కోసం ఆసక్తికర వార్తను అందరితో పంచుకుంది మేఘా ఆకాశ్. సాయి విష్ణు- మేఘా ఆకాశ్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సంప్రదాయబద్ధంగా ఈ ఇద్దరి పెళ్లి ఆదివారం చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు కుటుంబసభ్యులు, సన్నిహితులు, పలువురు ఇండస్ట్రీ ప్రముఖులు హాజరై వధూవరులిద్దరినీ ఆశీర్వదించారు. సాయి విష్ణు పాపులర్ తమిళ పొలిటిషన్ తిరునవుకరసు కుమారుడు సాయి విష్ణు. ఈవెంట్‌కు ఎంకే స్టాలిన్, ఉదయనిధి, దురై మురుగన్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆరేండ్లుగా ప్రేమలో ఉన్న మేఘా ఆకాశ్-సాయి విష్ణు ఫైనల్‌గా ఓ ఇంటివారు అయి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో నూతన దంపతులకు అభిమానులు, నెటిజన్లు సోషల్‌మీ



డియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మేఘా ఆకాశ్ ప్రస్తుతం వికటకవి, సహకుటుంబం సినిమాల్లో నటిస్తోంది.




## చుట్టమల్లే.. మిలియన్ రీల్స్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన దేవర చిత్రం ఈ నెల 27 వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలు, పాటలు బాగా అలరిస్తున్నాయి. చుట్టమల్లే సాంగ్ ఇప్పటికే భారీ వ్యూస్ తో దూసుకు పోతుండగా, ఈ పాట మరో రికార్డు ను క్రియేట్ చేసింది. ఈ పాటకి సోషల్ మీడియాలో మిలియన్ కి పైగా రీల్స్ వచ్చాయి. ఈ విషయాన్ని మేకర్స్ తాజాగా వెల్లడించారు. స్టార్ దర్శకుడు కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ లో సైఫ్ అలీఖాన్, ప్రకాష్ రాజ్, అజయ్, శ్రీకాంత్ లు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



## కంగువా వాయిదా..

తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోంది. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. సినిమాను దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ మొదలుపెట్టింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమా విడుదల తేదీ రోజునే తమిళంలో మరో పెద్ద సినిమా రాబోతుంది. ఇండియన్ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్'. తెలుగులో వేటగాడు అని వస్తున్న ఈ సినిమాకు జై భీమ్ ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఈ రెండు సినిమాలు ఒకే రోజు విడుదల అయితే బాక్సాఫీస్ వద్ద క్లాష్ అవ్వడంతో పాటు కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశముందని కంగువ టీం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఈ సినిమా విడుదల తేదీని అక్టోబర్ నుంచి నవంబర్‌కు షిఫ్ట్ చేయనున్నట్లు తెలుస్తుంది. మరోవైపు హీరో సూర్య కూడా.. రజినీకి గౌరవం ఇచ్చి తన సినిమాని వాయిదా వేస్తున్నట్లుగా కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతుంది.

## ఫార్మా సిటీ' ఉంటుందా.. లేదా..?

- కొనసాగిస్తుందో లేదో ప్రభుత్వం చెప్పాలి..
- గతంలో ఉన్న ప్లాన్ ప్రకారం చేయండి
- రద్దు చేస్తే భూములు తిరిగి రైతులకివ్వాలి..
- ఆ భూములను ఇతరాలకు వాడొద్దు
- రాజకీయాల కోసం యువతకు నష్టం చేయొద్దు
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ



**జనపదం, హైదరాబాద్:** హైదరాబాద్ లో తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్ట్ ను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా..? లేదా..? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. రాష్ట్ర హైకోర్టు సైతం ఈ ప్రాజెక్ట్ ను ప్రభుత్వం కొనసాగిస్తుందో? లేదో? స్పష్టత ఇవ్వాలని కోరిన నేపథ్యంలో కేటీఆర్ సైతం ప్రభుత్వాన్ని ఇదే అంశంపై ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం ఈ అంశంపై విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ను అంతర్జాతీయంగా నంబర్ వన్ గా నిలిపే ఉద్దేశంతో ఫార్మా సిటీ అనే బృహత్తరమైన ప్రాజెక్ట్ ను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పటికే తెలంగాణ ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల్లో దేశంలోనే 40 శాతం వాటా కలిగి ఉందన్నారు. వెయ్యి కి పైగా లైఫ్ సెన్సెన్స్ కంపెనీలకు రాష్ట్రం అడ్డాగా ఉందని, ఏటా 80 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను తెలంగాణ నుంచి తయారు చేస్తున్న విషయం ముఖ్యమంత్రికి తెలిసే ఉంటుందన్నారు. ఇలాంటి కీలకమైన రంగాన్ని మరింత ప్రోత్సహిస్తే రాష్ట్రానికి ఆదాయం పెరగటంతో పాటు మన యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. ఈ ఉద్దేశంతోనే 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే విధంగా తాము ఫార్మా సిటీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైయితే అంతర్జాతీయంగా ఫార్మా, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తుల్లో తెలంగాణ టాప్ లో ఉంటుందని చెప్పారు. 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అందించవచ్చన్న భావనతో ప్రాజెక్ట్ చేపట్టినట్లు గుర్తు చేశారు. దీనికి సంబంధించిన భూ సేకరణను కూడా పూర్తి చేశామన్నారు.

**కాంగ్రెస్ అధికారంతో గందరగోళం..**

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున మేలు చేసే ఫార్మాసిటీ ప్రాజెక్ట్ పై గందరగోళం నెలకొన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. హఠాత్తుగా ఈ ప్రాజెక్ట్ ను రద్దు చేస్తున్నట్లుగా సీఎం ప్రకటించటంతో ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ఆందోళన చెందాయన్నారు. అదే విధంగా ఫార్మా సిటీ వస్తే ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత, బతుకులు బాగుపడుతాయని భూములు ఇచ్చిన రైతుల్లో కూడా ఇప్పుడు గందరగోళం నెలకొని ఉందన్నారు. అసలు ప్రభుత్వం ప్రాజెక్ట్ ను కొనసాగిస్తుందా? లేదా? అన్న అంశంపై చాలా ఊహాగానాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రాజెక్ట్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించే ముందు భూములు ఇచ్చిన రైతులతో గానీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన సంస్థలతో గానీ ఎందుకు సంప్రదింపులు జరపలేదో చెప్పాలన్నారు. సరైన రోడ్ మ్యాప్ లేకుండా సీఎం చేసిన ప్రకటనతో ఫార్మా సిటీ భవితవ్యం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోందన్నారు. ప్రాజెక్ట్ కోసం రైతులు ఇచ్చిన భూములను ఇతర అవసరాలకు వాడతామని ప్రభుత్వం చెబుతుండటం కూడా రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు.

**గత ప్లాన్ ప్రకారం..**

ఫార్మా సిటీ విషయంలో స్పష్టత ఇవ్వాలని హైకోర్టు కూడా ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఇతర ప్రాజెక్టుల కోసం వినియోగిస్తామంటే కుదరదని హైకోర్టు స్పష్టం చేసిందని కేటీఆర్ చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఫార్మాసిటీ ప్రాజెక్ట్ ను కొనసాగిస్తే గతంలో తాము ప్రతిపాదించిన ప్లాన్ ప్రకారం గానీ లేదంటే మరింత విస్తరించే విధంగా ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఫార్మా సిటీ విషయంలో మొండిపట్టుదలకు పోయి రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీయవద్దని లేఖలో సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ కోరారు. ఫార్మా సిటీ ప్రాజెక్ట్ పూర్తైతే రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందన్నారు.

**రైతులకు భూములు తిరిగి ఇవ్వండి..**

ప్రభుత్వం ప్రాజెక్ట్ ను రద్దు చేయాలని భావిస్తే మాత్రం భూములు ఇచ్చిన రైతులకు వెంటనే ఆ భూములను అప్పగించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ కోసం ఇచ్చిన భూములను ఇతర అవసరాలకు వాడుతామంటే రైతులతో పాటు బీఆర్ఎస్ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. పైగా ఫార్మాసిటీ కోసం ఇచ్చిన భూములను వేరే అవసరాలకు వాడితే న్యాయపరమైన సమస్యలు కూడా తప్పవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, మరిన్ని కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే విధంగా ఉండాలని కేటీఆర్ కోరారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలనుకున్న ఫార్మా సిటీని అత్యున్నత పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ప్లాన్ చేశామని చెప్పారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్‌కు కట్టుబడి ఈ ప్రాజెక్ట్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కానీ ప్రాజెక్ట్ ను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తే మాత్రం లైఫ్ సెన్సెన్స్ కు రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్ గా మార్చే అవకాశాన్ని కోల్పోతామని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, అనిశ్చితితో కూడిన తొందరపాటు నిర్ణయాల కారణంగా రాష్ట్ర పురోగతి దెబ్బతింటుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కచ్చితంగా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే విధంగా ఉంటాయని భావిస్తున్నట్లు లేఖలో కేటీఆర్ ఆకాంక్షించారు.

## పటేల్ ను స్మరించిందా..?

- ఆయన కాంగ్రెసోడైతే.. విమోచన మెందుకు జరపడం లేదు..
- ప్రజా పాలన కాదు ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి..
- విమోచన దినోత్సవం జరిపితే భాగస్వామలవుతాం..
- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఎంపీ లక్ష్మన్ తో కలిసి ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన మంత్రి..




**జనపదం, హైదరాబాద్ సిటీ:** కేంద్రహోంశాఖ పూర్వమంత్రి, తెలంగాణ విమోచన కోసం అపరేషన్ పోలో నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంగ్రెసోడైతే.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ సర్కార్ అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణ విమోచనం కోసం ఆపరేషన్ పోలో నిర్వహించిన సర్దార్ పటేల్ ను ఎన్నడైనా కాంగ్రెస్ పార్టీ స్మరించిందా..? అని నిలదీశారు. తెలంగాణ విమోచన దినోత్సవాలను జరిపే అర్హత బీజేపీకి లేదని కాంగ్రెస్ నేతలు చేస్తోన్న వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. అయితే కాంగ్రెస్ కు మాత్రమే ఆ అర్హత ఉంటే ఇప్పటి వరకు తెలంగాణ విమోచన దినోత్సవాలను ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ 50 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పాలించారు కదా.. మరి నాటి నుండి ఎందుకు నిర్వహించలేదని, నాటి తెలంగాణ పోరాట యోధులను ఎందుకు స్మరించలేదు? అని బండి సంజయ్ నిలదీశారు. ఈనెల 17న పబ్లిక్ గార్డెన్స్ లో ప్రజా పాలన దినోత్సవంగా కాకుండా ప్రజా వంచన దినోత్సవంగా జరుపుకోండని ఎద్దేవా చేశారు. రేవంత్ సర్కార్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తే తాము కూడా భాగస్వాములవుతామని బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం పరేడ్ గ్రౌండ్స్ తెలంగాణ పోరాటానికి సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్ లో యువకులతో కలిసి క్రికెట్ ను ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలది అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, లేనప్పుడు మరోమాట అని విమర్శించారు. తెలంగాణ ప్రజలను హింసించిన రజాకార్ల పార్టీతో అంటకాగుతారా? అని ఆయన ప్రశ్నించారు. జై పాకిస్తాన్, జై పాలస్తీనా అని నినాదించిన ఒవైసీని పొగుడుతారా? అని నిలదీశారు. నిజాం నిరంకుశ పాలనపై కొమరం భీం, చాకలి ఐలమ్మ, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామక్రిష్ణారావు, కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలను, హిందూ మహాసభ, ఆర్య సమాజ్ పోరాటాలను గుర్తుచేసేందుకు రాబోయే తరాలకు ఈ చరిత్రను అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నామని బండి సంజయ్ చెప్పారు. తెలంగాణ విమోచనం కోసం జరిగిన పోరాటాలు మామూలు విషయం కాదన్నారు. రజాకార్ల పాలనలో దారుణాలు అన్నీ ఇన్నీ కావన్నారు. బైరాన్ పల్లి, గుండ్రాంపల్లి, పరకాల, వెయ్యి ఊడల మర్రి ఘటనలు ఇంకా కళ్ల ముందు మెదులుతున్నాయని చెప్పారు. నగ్నంగా మహిళలను బతుకమ్మ ఆడించిన దురాగతాలు మరవలేమని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవానికి ప్రధాన కారకులు సర్దార్ వల్లభాయి పటేల్ అని అన్నారు. ఆనాడు దేశంలోని 562 సంస్థానాలు విలీనం చేసే క్రమంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసేందుకు నిజాం అంగీకరించలేదన్నారు. దేశమంతా స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు స్వాతంత్ర్యం రాకపోతే భారతమాత కడుపులో క్యాన్సర్ గడ్డ అట్లాగే ఉండిపోతుందనే ఉద్దేశంతో ఆఫరేషన్ పోలోతో శస్త్ర చికిత్స చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన మహనీయుడు సర్దార్ వల్లభాయి పటేల్ అని కొనియాడారు. మలివిడత తెలంగాణ ఉద్యమంలో 1500 మందిని బలిదానం తీసుకున్న పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఉద్యమకారుల బలిదానాలతో తీవ్ర భావోద్వేదానికి గురైన సుష్మాస్వరాజ్ ఎవ్వరూ చనిపోవద్దని పేర్కొంటూ తెలంగాణ బిల్లును పార్లమెంట్ లో ఆమోదింపజేసి స్వరాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన సంగతి మర్చిపోయారా? అని సంజయ్ ప్రశ్నించారు. రజాకార్ల దళానికి వారసుడైన ఒవైసీని సీఎం రేవంత్ రెడ్డి పొగడం వెనుక ఉద్దేశ్యమేమిటని నిలదీశారు. జై పాకిస్తాన్ అనేటోళ్ళకు వత్తాసు పలకడమంటే కాంగ్రెస్ దుర్మార్గాలకు పరాకాష్ట అని ఆయన విమర్శించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్ళి భారత దేశాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు.

## క్రేజీ.. కేజ్రీ..

- రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన ఢిల్లీ సీఎం..
- రెండు మూడు రోజుల్లో పదవిని వదులుకుంటానని ప్రతిజ్ఙ..
- నిజాయితీ నిరూపించుకున్న తర్వాతే మళ్లీ పదవని శపథం..
- కొత్త రాజకీయాలకు అరవింద్ ఆజ్యం..

**జనపదం, ఢిల్లీ:** ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం సంచలన ప్రకటన చేశారు. రెండు రోజుల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోతున్నట్టు ప్రకటించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తన నిజాయితీని ధృవీకరించిన తర్వాతే ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిని చేపడతానని తెలిపారు. 'మా నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు మేం ప్రజా కోర్టు వెళతాం' అని కేజ్రీవాల్ ప్రకటించారు. ఆదివారం ఢిల్లీలో ఆప్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 ఫిబ్రవరికి బదులు 2024 నవంబర్‌లోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. 'సుప్రీంకోర్టు విధించిన షరతుల కారణంగా మేం పనిచేయలేమని కొందరు చెబుతున్నారు. నేను నిజాయితీ పరుడిని అని మీరు భావిస్తే నాకు పెద్ద సంఖ్యలో ఓట్లు వేయండి. మళ్లీ ఎన్నికైన తర్వాత మాత్రమే నేను సీఎం కుర్చీలో కూర్చుంటాను. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. మహారాష్ట్ర ఎన్నికలతోపాటే నవంబర్‌లో ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నా. ఎన్నికలు అయ్యేదాకా పార్టీ నుంచి మరొకరు ముఖ్యమంత్రిగా ఉంటారు. రెండు మూడు రోజుల్లో పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటాం' అని కేజ్రీవాల్ చెప్పారు.

**ఆప్ను చీల్చేందుకు బీజేపీ కుట్ర**

ఆప్‌ను చీల్చి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని కేజ్రీవాల్ ఆరోపించారు. వారు తన నైతిక స్థైర్యాన్ని కూడా దెబ్బతీయాలని ప్రయత్నించారని, కానీ అందులో విఫలమయ్యారని అన్నారు. 'వాళ్లు పార్టీని చీల్చాలనుకున్నారు. కేజ్రీవాల్ ధైర్యాన్ని, నైతికతను దెబ్బతీయాలనుకున్నారు. వాళ్లొక ఫార్ములాను పెట్టుకున్నారు. పార్టీలను చీల్చడం, ఎమ్మెల్యేలను చీల్చడం.. నాయకులను జైళ్లకు పంపడి. కేజ్రీవాల్‌ను జైలుకు పంపడం ద్వారా ఢిల్లీలో వాళ్ల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని అనుకున్నారు. కానీ.. వాళ్లు పార్టీని చీల్చలేక పోయారు. పార్టీ కార్యకర్తలను కూడా చీల్చలేకపోయారు' అని కేజ్రీవాల్ అన్నారు. జైల్లో ఉన్న కాలంలో ముఖ్యమంత్రి పదవికి ఎందుకు రాజీనామా చేయలేదో వివరించిన కేజ్రీవాల్.. 'దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని అనుకున్నానని, అందుకే రాజీనామా చేయలేదు.. వారొక ఫార్ములా పెట్టుకున్నారు. ఎక్కడైతే వారు ఓడిపోతారో.. అక్కడ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని జైలుకు పంపి, తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం' అన్నారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com